అడవి అన్యాక్రాంతం

- ఇష్టారీతిన చెట్లను నరికివేస్తున్న కలప దొంగలు
- ఎల్లారెడ్డి అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ కరువు


హాజీపూర్ అటవీ ప్రాంతంలో నరికేసిన చెట్లు (ఫైల్)


వెల్లుట్లలో కామారెడ్డి అటవీశాఖ ప్రత్యేక అధికారుల బృందం పట్టుకున్న కలప దుంగలు (ఫైల్)

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి అటవీశాఖ పరిధిలోని అటవీ ప్రాంతం అన్యాక్రాంతం అవుతున్నా అధికారులలో చలనం ఉండటం లేదు. వారం రోజుల వ్యవధిలో వందలాది కలప దుంగలు దొరికినా అటవీ ప్రాంతాన్ని సంరక్షించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పలు గ్రామాలలో దాచిన కలపను ప్రత్యేక బృందాలు వచ్చి పట్టుకున్నప్పటికీ స్థానికంగా పనిచేసే అధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యకరం. హాజీపూర్, వెల్లుట్ల, జాన్కంపల్లి తదితర ప్రాంతాలలో అటవీ ప్రాంతంలో వందలాది చెట్లు నరికేశారు. కొద్ది చెట్లే నరికేశారని అధికారులు నివేదికలు అందించి జరిమానాలు విధించారు. కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల వెల్లుట్ల గ్రామంలో వందకు పైగా టేకు దుంగలు ఉన్నాయని గ్రామస్తులు కామారెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ప్రత్యేక బృందాలు గ్రామంలో దాచిన కలపను పట్టుకుని స్థానిక అధికారులకు అప్పగించారు. జాన్కంపల్లి ఖుర్దు గ్రామంలో పొలంలో దాచిన వందకు పైగా టేకు దుంగలు దాచి ఉంచడంతో స్థానిక అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఇలా పలు చోట్ల వందల సంఖ్యలో టేకు దుంగలు దొరికినప్పటికి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడంతో దొంగలకు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఏదేమైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయడంతో పాటు రాత్రి వేళల్లో సైతం కలప రవాణా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే అటవీ సంపదను సంరక్షించిన వారమవుతారు.


జాన్కంపల్లి ఖుర్దు శివారులో దొరికిన కలపను అటవీశాఖ కార్యాలయానికి తరలిస్తూ.. (ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం

అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అటవీశాఖ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నాం. మా సిబ్బంది ఎల్లవేళలా పర్యవేక్షణ చేస్తున్నారు.

– ఓంకార్, ఎఫ్ఆర్‌వో, ఎల్లారెడ్డి

క్లుప్తంగా

పాఠశాలలో మాక్ అసెంబ్లీ



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. సోషల్ టీచర్లు రాజు, అశోక్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో రాజు హాజరయ్యారు. విద్యార్థులు సీఎం, ప్రతిపక్ష నేత, గవర్నర్, శాసనసభ స్పీకర్‌గా చక్కగా వ్యవహరించి సమస్యలను ప్రతిబింపజేశారని, ఇలాంటి సభలతో విద్యార్థుల్లో రాజకీయ, సామాజిక అవగాహన ఏర్పాడుతుందని డీఈవో అభినందించారు. అంతకుముందు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం పట్ల సంతాపం ప్రకటిస్తు రెండు నిమిషాల మౌనం పాటించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుశర్మ, హెచ్‌ఎం గంగాకిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సాయిలు, శ్రీశైలం, రమేష్, భవానీ, సుష్మ, కరుణ, నీలిమ పాల్గొన్నారు.

విద్యార్థులకు అందిన 'మధ్యాహ్న భోజనం'



సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జప్తిజాన్కంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎట్టకేలకు గురువారం మధ్యాహ్న భోజనం అందించారు. గత ఐదునెలలుగా పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకం నిలిచిపోయిన ఘటనపై 'సాక్షి'దినపత్రికలో గత నెల 31న 'ఇంటి భోజనమే దిక్కు'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి గ్రామస్తులు స్పందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మునెమ్మ, మాజీసర్పంచ్ దేశబోయిన సాయిలు, తాండూర్ సొసైటీ వైస్ చైర్మన్ బాబురావు, గ్రామపెద్దలు లచ్చాగౌడ్, రాములు తదితరులు పాఠశాలకు చేరుకొని హెచ్‌ఎం అనసూజతో చర్చించారు. భోజనం వండేందుకు గ్రామానికి చెందిన ముత్యంను ఒప్పించగా గురువారం పాఠశాలలో భోజనం వండి విద్యార్థులకు అందించారు. కాగా పాఠశాలకు ఎంఈవో భాస్కర్‌రెడ్డి రావడంతో తమ పాఠశాలలో ఇన్నాళ్లు మధ్యాహ్న భోజన పథకం అమలు కాకపోవడంపై ఎందుకు స్పందించలేదని మాజీ సర్పంచ్, గ్రామస్తులు ప్రశ్నించినట్లు తెలిపారు. గ్రామస్తులమంతా కలిసి బడిలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తే తమరు ఇప్పుడు వస్తారా అంటూ నిలదీశారు.

సర్వే పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట, కన్నాపూర్ తదితర గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు కార్యదర్శులు వెళ్లి సర్వే చేశారన్నారు. వాటిని రెండవసారి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: పట్టణంలోని కలెక్టరేట్‌లో గురువారం ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను, ఐపాస్ స్టడీ మెటీరియల్‌ను డీఈవో రాజు ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, శ్రీనివాస్, వేణుశర్మ, బలరాం, ఉపాధ్యాయులు లింగారెడ్డి, లక్ష్మీరాజం, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాలలో కౌమార దశ శిక్షణలో భాగంగా విద్యార్థులకు గురువారం వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, సంస్థ సిబ్బంది, రాణి, రమేష్, వంశీకృష్ణ, యాదగిరి, శ్రీవిద్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కార్యవర్గాల ఎన్నిక..

ముత్యంపేట గౌడ సంఘం



దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామ ఎల్లమ్మ ఆలయ కమిటీ నూతన కార్యవర్గంను గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేపీ రామాగౌడ్, అధ్యక్షుడిగా సిద్ధాగౌడ్, ఉపాధ్యక్షుడిగా అనిల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌గౌడ్, కోశాధికారిగా నీలంగౌడ్ ఎన్నికయ్యారు.

పోతాయిపల్లి ముదిరాజ్ సంఘం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోతాయిపల్లి ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంద బాలయ్య, ఉపాధ్యక్షుడిగా గెరబోయిన కిష్టయ్య, స్పీకర్ పెద్దబోయిన అనిల్, కోశాధికారులుగా వెల్పుల శ్రీను, తలారి అల్లూరి పూజారి, సభ్యులుగా బోనగిరి నర్సింలు, వెల్పుల బాలరాజు, పెద్దబోయిన రమేష్, సోనబోయిన భూమయ్య, వెల్పుల ప్రభాకర్, గెరబోయిన అంజయ్య ఎన్నికయ్యారు.

కాచాపూర్ మున్నూరుకాపు సంఘం..



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గంను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మదాం చిన్నబాబు, ఉపాధ్యక్షుడిగా ఆకుతోట శ్రీశైలం, కోశాధికారిగా ముదాబు బాబు ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీధర్ వారిని సన్మానించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పెంచిన కూలి రేట్లు అమలుపర్చాలి



కామారెడ్డి టౌన్/బాన్సువాడ/బిచ్కుంద(జుక్కల్): హమాలీలకు పెంచిన కూలి రేట్ల జీవోను విడుదల చేసి, అమలు చేయాలని సివిల్ సప్లయ్ హమాలీల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాలో వారు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజు కొనసాగుతోంది. జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు సమ్మె శిబిరంలో కూర్చొని నినాదాలు చేశారు. అలాగే బాన్సువాడలో, బిచ్కుంద మండల కేంద్రంలో హమాలీలు సమ్మె నిర్వహిస్తున్నారు. పలువురు హమాలీలు మాట్లాడుతూ.. పని భద్రత కల్పించాలని, బోనస్ పెంచాలని, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో విడుదల కోసం హమాలీలు ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు.

లింగంపేట జీపీ స్థలం పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ స్థలాన్ని ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. లే అవుట్ చేసిన భూమిలో గ్రామ పంచాయతీకి కేటాయించిన నాలుగు ప్లాట్లను కొంత మంది కబ్జా చేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు ఇటీవల ధర్నా, రాస్తారోకో చేశారు. అలాగే స్థలం యజమానులు ఇంటి నిర్మాణం కోసం జీపీ కార్యదర్శి అనుమతి ఇవ్వడంలేదని ఇటీవల ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. సదరు స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్రామ పంచాయతీకి కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

తమ్మనపట్టిలో అయ్యప్ప స్వాముల అన్నదానం



గాంధారి(ఎల్లారెడ్డి): కేరళ–తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు గ్రామమైన తమ్మన పట్టిలో ఆదివరం అయ్యప్ప ఆలయంలో ఈనెల 1న కామారెడ్డి జిల్లాకు చెందిన చంద్రశేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించినట్లు గాంధారికి చెందిన గురుస్వామి అంజగౌడ్, పాదం స్వామి వెంకటేశం, కులకర్ణి చక్రదర్ గురువారం తెలిపారు. శిబిరంలో మండల కేంద్రానికి చెందిన పలువురు అయ్యప్ప భక్తులు సేవ చేస్తున్నట్లు తెలిపారు.

స్వాములకు మైనారిటీ నేత అల్పాహారం



పిట్లం(జుక్కల్): మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం రాత్రి మండలంలోని అయ్యప్ప స్వాములకు హస్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు రహ్మెతుల్లా అల్పాహారం ఏర్పాటు చేశారు. అంతేకాకుండ వారికి వడ్డించారు. ప్రతి సంవత్సరం స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేస్తానని రహ్మెతుల్లా పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తాడ్వాయి నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలి


మేనూర్ మోడల్ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ముజీబ్


ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ మహేందర్

మద్నూర్(జుక్కల్)/ఎల్లారెడ్డి/భిక్కనూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు సూచించారు. పలు మండలాల్లోని ప్రభుత్వ బడులు, హాస్టళ్లను గురువారం స్థానిక అధికారులు తనిఖీ చేశారు. మద్నూర్ మండలం మేనూర్‌లోని మోడల్ స్కూల్‌ను తహసీల్దార్ ముజీబ్ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల కోసం వండుతున్న వంటలను పరిశీలించారు. ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్ హాస్టల్ విద్యార్థులతో కలిసి తహసీల్దార్ మహేందర్ కుమార్ భోజనం చేశారు. అనంతరం హాస్టల్‌లో రికార్డులను, వంటలను పరిశీలించారు. భిక్కనూరులోని బీసీ హాస్టల్ ను ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి సందర్శించారు. హాస్టల్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేసి, వార్డెన్ సునీతను అభినందించారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను తహసీల్దార్ శివప్రసాద్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అనారోగ్యంతో ఎద్దు మృతి



భిక్కనూరు: అనారోగ్యంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని లంబడి మన్నేకు చెందిన ఎద్దు అనారోగ్యానికి గురవడంతో పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది మందులు ఇచ్చినా ఎద్దు మృతి చెందింది. పశు వైద్య సిబ్బంది సక్రమంగా వైద్యం అందించలేదని, వారి నిర్లక్ష్యం కారణంగానే ఎద్దు మృతిచెందిందని బాధితుడు ఆరోపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జీపీ భవన నిర్మాణ పనులు చేపట్టొద్దు


నాగిరెడ్డిపేట ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎర్రకుంట తండావాసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో గ్రామ పంచాయతీ(జీపీ) భవన నిర్మాణ పనులు చేపట్టొద్దని అదే పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట తండాకు చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం బెజుగంచెరువుతండా, ఎర్రకుంటతండాను కలిపి నూతన జీపీగా ఏర్పాటు చేశారన్నారు. కాగా పంచాయతీ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం రెండుతండాల మధ్య నిర్మించాల్సిన జీపీ భవనాన్ని తక్కువ జనాభా ఉన్న బెజుగంచెరువుతండాలో నిర్మించేందుకు కొందరు నిర్ణయించారని ఆరోపించారు. ఎక్కువ జనాభా ఉన్న ఎర్రకుంటతండాలోనే ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు ఆరోగ్య ఉపకేంద్రం కూడా ఉన్నాయన్నారు. తమ తండాలో 400 మంది జనాభా ఉన్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బెజుగంచెరువుతండాలో నిర్మించదలచిన జీపీ భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. మాజీ ఉపసర్పంచ్ గోప్యా, పలువురు తండావాసులున్నారు.

కొనసాగుతున్న సమ్మె



కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్టణంలో చేపట్టిన సమ్మె గురువారం 24వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా వారు చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చి సంకెళ్లను తొలగించాలని ఉద్యోగులు కోరారు. మ్మె శిబిరాన్ని ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు మంజుల సందర్శించి సంఘీభావం తెలిపారు. సంఘం మహిళా అధ్యక్షురాలు వాసంతి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పిట్లం(జుక్కల్): ఖంబాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పైప్‌లైన్ లీకేజై మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నాయి. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోవడంతో రహదారి బురదమయంగా మారింది. నీరు లీకేజీ అవుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వరినారు కొనలను తుంచి నాట్లు వేయాలి


మెల్లకుంటతండాలో వరినారును పరిశీలిస్తున్న ఏవో సాయికిరణ్


చిన్న ఎక్లారలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరినాట్లు వేసే ముందు రైతులు వరినారు కొనలను తుంచి వేయాలని, దీనివల్ల వరిపంటలో మోగిపురుగు ఉధృతిని తగ్గించవచ్చని ఏవో సాయికిరణ్ సూచించారు. మండలంలోని మెల్లకుంటతండా సమీపంలో రైతులు వేస్తున్న వరినాట్లను గురువారం ఏఈవో దివ్యతో కలిసి ఆయన పరిశీలించారు. నాట్లు వేసే ఒక వారంరోజుల ముందు ఎకర వరినారుపై 800గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ 3జీ గుళికలను చల్లుకోవాలన్నారు. దీనివల్ల మోగిపురుగు తీవ్రతను తొలిదశలోనే నివారించవచ్చని ఆయన చెప్పారు. అంకురం ఏర్పడేదశలో పోటా ష్‌ను చల్లుకోవాలని ఆయన సూచించారు.

మినుము పంట పరిశీలన

మద్నూర్(జుక్కల్): మండలంలోని చిన్న ఎక్లారలో గురువారం యాసంగి మినుము పంటను ఏఈవో అనిల్ పరిశీలించారు. ప్రస్తుతం మినుము పంట పూత, కాయలు ఏర్పడు దశలో ఉందని అన్నారు. మినుము పంటకు తెగుళ్లు ఆశించాయని రైతులు సకాలంలో జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం పట్టణంలోని బల్దియా కార్యాలయాన్ని ముట్టడించారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రెండు నెలల వేతనాలు చెల్లిస్తామని మున్సిపల్ కమిషనర్ స్పందన కార్మికులకు హామీ ఇచ్చారు. మున్సిపల్ వాటర్‌వర్క్స్‌లో పని చేస్తున్న నలుగురికి వేతనం పెంచడాన్ని నిరసిస్తూ కార్మికులు మున్సిపల్ కమిషనర్ స్పందనను నిలదీశారు. దీంతో ఆ నలుగురి వేతనాల పెంపును నిలిపివేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించడంతో కార్మికులు ఆందోళనను విరమించారు.

మన్నె కులానికి గుర్తింపు ఇవ్వండి


ఏకసభ్య కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న మన్నె కుల సంఘం సభ్యులు

రాజంపేట/భిక్కనూరు: మన్నె కులానికి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి జిల్లా ఎస్సీ మన్నె కుల సంఘం సభ్యులు గురువారం నిజామాబాద్‌లో ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన్నె(44)కులానికి సమాజంలో గుర్తింపు వచ్చేవిధంగా, జనాభా ప్రాతిపదికన మా రిజర్వేషన్ శాతం మాకు కేటాయించాలని కోరారు. మన్నె కులాన్ని బతికించి భావితరాల భవిష్యత్తుకు గుర్తింపు తెచ్చే విధంగా చూడాలని కోరారు. నేతలు బాలయ్య, నాగభూషణం, మల్లేశం, సాయిలు, నవీన్ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

కామారెడ్డి అర్బన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వ ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట ఉపాధ్యక్షుడు ఆర్ బాగయ్య, జిల్లా అధ్యక్షుడు సాయన్న తెలిపారు. గురువారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ కమిషన్‌ను కలిసి ఎస్సీల పరిస్థితిని వివరించినట్లు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

మాచారెడ్డి: దోమకొండ మండలం సంగమేశ్వర గ్రామానికి చెందిన చంద్రారెడ్డి ఇటీవల తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీఈఐఆర్ ద్వార ఫోన్‌ను రికవరీ చేశారు. బాధితుడికి గురువారం మాచారెడ్డి ఎస్సై అనిల్ అప్పగించారు.

సంక్షిప్తం

అయ్యప్ప సన్నిధానానికి విరాళం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప సన్నిధానం నిర్మాణం కోసం రూ.25 వేలు విరాళంగా అందించారు. ఆయా పాఠశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, స్వాములు ఉన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన ఏఎంసీ చైర్మన్

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని గురువారం పిట్లం మార్కెట్‌కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మార్కెట్ కమిటీ అభ్యున్నతికి సహకరించాలని ఆయనను కోరినట్లు ఏఎంసీ చైర్మన్ తెలిపారు.

వీడీసీ ప్రతినిధులకు సన్మానం

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి వీడీసీ మాజీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, తాజా అధ్యక్షుడు గూడెల్లి గంగారామ్‌లను గురువారం దేవునిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఉమాకాంత్‌రావు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించినందుకు కృతజ్ఞతగా సన్మానించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

ఆధ్యాత్మిక వేత్త పద్మాకర్‌కు..

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీసంకష్ట హర మహాగణపతి ఆలయాన్ని గురువారం ఆధ్యాత్మిక వేత్త, త్రిభాషా శతావధాని, ప్రణవ పీఠాధిపతి వద్దిపర్తి పద్మాకర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. వేదపండితులు అంజనేయశర్మ, అర్చకులు యజ్ఞం సంపత్‌కుమార్ శర్మ, సతీష్‌పాండే, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కరదీపికల ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిషరీస్, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఫిషరీస్ కరదీపకను గురువారం ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అడకమిక్ సమన్వయకర్త విశ్వప్రసాద్, అధ్యాపకులు దినకర్‌రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను తరలిస్తే ఊరుకోం

ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెదలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను తరలిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ అన్నారు. ఎల్లారెడ్డిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో వసతులు లేవనే సాకుతో ఇక్కడి నుంచి తరలించేందుకు చేస్తున్న పనులు సరికాదని అన్నారు. కళాశాలను ఇక్కడే కొనసాగించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి

బీబీపేట: మండలంలోని మాందాపూర్ గ్రామంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన పరికి నర్సింలు లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. గురువారం విద్యుత్ శాఖ విడుదల చేసిన పదోన్నతుల్లో ఆయనకు అవకాశం దక్కింది. దీంతో ఆయన పదోన్నతి పొందుతూ కామారెడ్డి రూరల్‌కు బదిలీ అయ్యాడు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

మాచారెడ్డి: సీఎం కప్‌లో భాగంగా హైదారాబాద్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్వంచ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మౌనిక, పల్లవి సత్తా చాటారు. కామారెడ్డి జిల్లా అథ్లెట్స్‌లో మూడో స్థానం పొంది మెడల్ సాధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్ గురువారం విద్యార్థినులను అభినందించారు.